మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 293
పేజీలు : 3
మంగళవారం-26 మే, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




# కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు

- మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యం
- సీఎం రేవంత్ రెడ్డి

**టి మీడియా, మే 25, హైదరాబాద్ బ్యూరో:**
రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి మరిన్ని కీలక నిర్ణయాలను ప్రకటించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడానికి అన్ని నియోజకవర్గాల కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయిలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభించడానికి వీలుగా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లతో పాటు మహిళలు వ్యాపార రంగంలో మరింతగా రాణించడానికి స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైస్ మిల్లులు, గోడౌన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బ్యాంకుల నుంచి వీటికి అవసరమైన రుణాలను ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు."ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల కోసం 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు ముఖ్యమంత్రి గారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ధనసరి



అనసూయ సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారు, పలువురు ప్రజాప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహిళలకు అందించే ఇందిరమ్మ చీరల డిజైన్లను ముఖ్యమంత్రి గారు కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, "సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవడానికి మొదటి విడతగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వం అవసరమైన స్థలం గుర్తించి మహిళా సంఘాలకు నామినల్ అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లపాటు లీజుపైన ఇవ్వడానికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి" అని మంత్రి పొంగులేటి కి చెప్పారు. ఈ సూపర్ బజార్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కార్పస్ ఫండ్ ఇస్తామని, సంఘాల్లోని ప్రతి మహిళ కొంత మేరకు పెట్టుబడిని సమకూర్చుకోవాలని సూచించారు. "కార్పొరేట్ కంపెనీలు నడిపిస్తున్న చైన్ సూపర్ బజార్లలో వస్తువులను అత్యధికంగా కొనుగోలు చేసేది మహిళలే. దేశంలోనే అత్యుత్తమ సూపర్ బజార్లుగా రాణించాలి" అని అభిలషిస్తూ అందుకు ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. "రైస్ మిల్లులను స్వయంగా మీరే పెట్టుకోండి. అదే విధంగా లాజిస్టిక్ సెంటర్లను కట్టుకోండి. మండలాల్లో స్థలాలు ఇచ్చే బాధ్యత నాది. పెద్ద గోడౌన్లు కట్టుకోండి. భవిష్యత్‌లో బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. కొత్త మంది మిల్లర్లు, దళారులు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. మహిళల దగ్గర నుండే మిల్లర్లు తీసుకెళ్లాలి. ప్రతి మండలంలో 2 నుండి 4 స్థలాలను గుర్తించి గోడౌన్లు నిర్మించుకోవడానికి ఏ విధమైన ప్రణాళిక అవసరమో కలెక్టర్లు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశిస్తున్నా. అందుకు అవసరమైన స్థలాలు ఇచ్చే పూచీ నాది. ఇందుకు అవసరమైన రుణాలను జీరో వడ్డీతో బ్యాంకు లింకేజీ కూడా సహకారం ఇస్తాం" అని చెప్పారు . "మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా నిలబడుతుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా 29 నెలల్లో రూ. 10 వేల కోట్లకు పైగా సంస్థకు చెల్లించాం" అని పేర్కొన్నారు. "ఇందిరాగాంధీ స్త్రీ శక్తి అంగన్ వాడీ భవనాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, అద్దెపై ఆర్టీసీకి ఇవ్వడానికి బస్సులతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ఈ వారంలో చేపడుతున్నాం. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు 8 వేల భవనాలను ఒకే రోజు శంకుస్థాపన చేసుకుని దేశంలోనే ఒక గొప్ప కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించుకున్నాం" ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మంత్రులు, అధికారులను అభినందించారు.

"మహిళా సంఘాలకు వెయ్యి బస్సులను కేటాయించి తద్వారా అద్దె రూపేణా నెలకు రూ. 70 వేల ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు వేశాం. అందులో భాగంగా జూన్ 5వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి మరో 553 బస్సులను అందించబోతున్నాం" అని ప్రకటించారు. "ఆడబిడ్డలకు బ్యాంకు రుణాల లింకేజీ ఇవ్వడమే కాకుండా, వ్యాపారంలో రాణించడానికి, వారికి కావలసిన వ్యాపారాలు వారు వృద్ధి చేసుకోవడానికి వీలుగా ఈ నెల 29న వీ-హబ్ ద్వారా ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ కింద అవసరమైన వ్యాపారాల ప్రణాళికలను అందించే కార్యక్రమం చేపడుతున్నాం" అని చెప్పారు. "మహిళా సంఘాలకు బ్యాంకు రుణాల లింకేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుతున్నాం. మహిళా సంఘాల రుణాలపై జీరో వడ్డీ కింద ప్రభుత్వం రూ. 1390 కోట్లు చెల్లించింది. చెల్లింపుల్లో నిర్మల్ జిల్లా నూటికి శాతం నూరు శాతం చెల్లించారని" చెబుతూ ఆ జిల్లా మహిళలను ముఖ్యమంత్రి గారు అభినందనలు తెలిపారు. అన్ని జిల్లాల నుంచి కలెక్టర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జిల్లాల మహిళా ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అధిక లాభాలను ఆర్జించిపెట్టే పంటల మార్పిడి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. "2034 నాటికి కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మంత్రిమండలి మొత్తం మహిళలందరినీ సొంత సోదరీమణులుగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది.." అని ముఖ్యమంత్రి అన్నారు.



# తెలంగాణకు రూ.9,968 కోట్లు

- ఐదేళ్లలో వినియోగించుకోవాలని ఆర్థికసంఘం కండీషన్
- మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం




**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో :**
కేంద్ర 16వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,968 కోట్ల నిధులను కేటాయించింది. 2026-27 నుంచి 2030-31 వరకు ఈ ఫండ్స్?ను నిర్దేశించింది. వాటి వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం పలు రకాల మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మొత్తాన్ని గ్రామీణంలో స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారులు, వీధి దీపాలు, ఇతర ప్రజా సేవల కోసం వినియోగించాలని పేర్కొంది. ఈ గ్రాంట్లను ఎట్టి పరిస్థితుల్లో వేతనాలు, పెన్షన్ చెల్లింపుల కోసం వినియోగించరాదని నిర్దేశించింది.

**త్రైమాసిక వార్షిక నివేదికలు :**
ఎప్పటికప్పుడు ఖర్చు చేసిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆర్థిక సంఘం సూచించింది. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాలంది. వాటి ఆధారంగా పూర్తి నివేదికలను రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఆడిట్‌లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాలని తెలిపింది. అవకతవకలు లేదా గ్రాంటుల దుర్వినియోగం జరిగిందని తేలితే చట్టపరమైన చర్యలు చేపట్టాలని పేర్కొంది. వీటిపై పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది.

**పనితీరు ఆధారంగా**
ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం దేశం మొత్తానికి రూ.4,35,236 కోట్లను గ్రాంట్లుగా(తిరిగి చెల్లింపులు ఉండవు) ఇస్తుంది. పంచాయతీలకు 80 శాతం, మండల, జిల్లా పరిషత్‌లకు 10 శాతం చొప్పున ఏటా రెండు సమాన విడతల్లో ఈ నిధులు విడుదలవుతాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో జూన్‌లో మొదటి, అక్టోబరులో రెండో విడతగా ఫండ్స్ అందుతాయి. రాష్ట్రాలు స్థానిక సంస్థలకు ఏ మేరకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నాయనే అంశం ఆధారంగా రాష్ట్ర పనితీరును పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల ఆధారంగా గ్రామ పంచాయతీల పనితీరును పరిగణించి 20 శాతం నిధులివ్వడంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

**వెయిటేజీ ప్రతిపాదికన**
2026 నాటి అంచనా ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర విస్తీర్ణానికి 10 శాతం వెయిటేజీ ప్రాతిపదికన నిధులను ఆర్థిక సంఘం కేటాయించింది. ఇలా లెక్కేసినప్పుడు గ్రామీణ జనాభాకు 1.92 శాతం, తెలంగాణ వైశాల్యానికి 0.37 శాతానికి మొత్తం రూ.4,35,236 కోట్లలో రూ.9,968 కోట్లను ఆర్థిక సంఘం రాష్ట్రానికి మంజూరు చేసింది.

**మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు**
మొదటి విడత నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆయా స్థానిక సంస్థల ఆడిట్ రిపోర్టులను సమర్పించాలి. మొదటి విడత నిధుల వినియోగ ధ్రువీకరణ, పురోగతి నివేదికల ప్రకారం రెండో విడత నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది.గ్రాంట్లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాతాకు వెళ్తాయి. వాటిని పది పని రోజుల్లో సంబంధిత గ్రామీణ స్థానిక సంస్థలకు ట్రాన్స్?ఫర్ చేయాలి.రాజ్యాంగంలోని 9వ భాగం ప్రకారం సక్రమంగా ఎన్నికైన స్థానిక సంస్థలకే నిధులు సాఫీగా విడుదలవుతాయి.నిర్దేశిత అవసరాలకు కేటాయించిన నిధులను తప్పకుండా వాటికే ఖర్చు చేయాలి. వాటిని టైడ్ నిధులు అని కూడా అంటారు. అన్‌టైడ్ నిధులలో 20 శాతం కంటే ఎక్కువ నిధులను రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం వెచ్చించరాదు.నిధుల వినియోగంపై గ్రామ సభలో, మండల, జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల్లో విధిగా తీర్మానం చేయాల్సి ఉంటుంది. వాటిని ఇ-గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో ఎంటర్? చేయాల్సి ఉంటుంది.

# డ్వాక్రా మహిళలను ఎంటర్ ప్రెన్యుర్లుగా మారుస్తాం

- సీఎం చంద్రబాబు

**టి మీడియా, మే 25, అమరావతి బ్యూరో :**
ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని అన్నారు. ఏపీలో వనరులు వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీతోపాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదిక పైకి వచ్చాయన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సీఎం సూచించారు. 500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామన్నారు. 200 కోట్లతో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నాని చంద్రబాబు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వంద




పార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు.

**మహిళల సంఘాల వద్ద 28 వేల కోట్ల కార్పస్ ఫండ్**
**శ్రీసిటీ** విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని అన్నారు. 28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యుర్లుగా మారుస్తామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామన్నారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ దీనిని అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమన్నారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందన్నారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

**ఎలక్ట్రికల్ ఉత్పత్తులను తిలకించిన సీఎం**
అంతకుముందు విజయవాడ గ్రోత్ సమ్మిట్ 2026లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు . ఆర్ టి ఐ హెచ్ లోని వివిధ స్టార్టప్ సంస్థలు రూపొందించిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్, వీరపనేనిగూడెంలో డిఫెన్స్ ఉత్పత్తుల, మచిలీపట్నంలోని బీహెచ్ఈఎల్ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులను సీఎం తిలకించారు. డ్రోన్ బోట్స్ సహా గిరిజనులు సాగు చేస్తోన్న కొండ చీపురు గడ్డి ఉత్పత్తులను ఆయన పరిశీలించారు.



# అన్నాడీఎంకేలో ముసలం

- ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేల రాజీనామా

**టి మీడియా, మే 25, చెన్నై :**
తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అన్నాడీఎంకే పార్టీకి చెందిన ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. సీవీ షణ్ముగం, ఎస్?పీ వేలుమణి నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి చెందిన ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు చెన్నై సచివాలయంలో తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు. అనంతరం వీరి రాజీమానాలను స్పీకర్? ఆమోదించారు.రాజీనామా చేసిన వారిలో మదురాంతకం నియోజకవర్గం నుంచి గెలిచిన మరగాథం, ధారాపురం నుంచి గెలిచిన సత్యభామ, పెరుందురై నుంచి ఎన్నికైన జయకుమార్ ఉన్నారు. నిర్ణీత విధానాల ప్రకారం ఆ ముగ్గురుఅన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా పత్రాలు సరైన ఫార్మాట్‌లో ఉన్నందున వాటిని ఆమోదించినట్లు స్పీకర్ ప్రభాకర్ తెలిపారు. ఈ క్రమంలోనే పదవి నుంచి వైదొలగడానికి గల కారణాన్ని పేర్కొనాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఫలితంగా మదురాంతకం, ధారపురం, పెరుందరై నియోజకవర్గాలతో పాటు రెండు స్థానాలు గెలిచి ముఖ్యమంత్రి విజయ్ రాజీనామా చేసిన తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గానికి కూడా ఉప ఎన్నికలు జరుగనున్నాయి.

## టీవీకేలో చేరే అవకాశం

స్పీకర్‌కు రాజీనామాలు సమర్పించిన వెంటనే, ఈ ముగ్గురు నేతలు సచివాలయంలోని టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. ఈ ముగ్గురు త్వరలోనే టీవీకేలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో బలపరీక్ష సమయంలో, అన్నాడీఎంకే జారీ చేసిన

మిగతా 3లో....


# పద్మ పురస్కారాల ప్రదానం

- ధర్మేంద్ర తరఫున అందుకున్న హేమమాలిని

**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో :**
రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జూ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ఇద్దరు పద్మవిభూషణ్, ఆరుగురు పద్మ భూషణ్, 58 మంది పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు.

**దివంగత ధర్మేంద్రకు పద్మ విభూషణ్ పురస్కారం**
బాలీవుడ్‌కు విశేష సేవలందించిన సినీ నటుడు ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించగా ఆయన భార్య హేమమాలినీ రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ధర్మేంద్ర పేరు ప్రకటించగానే ఆయన కూతురు అహానా డియోల్ భావోద్వేగానికి గురయ్యారు. అంతకుముందు ఈ గౌరవం తమ కుటుంబానికే కాకుండా యావత్ దేశానికి ఆనంద క్షణం అని హేమా మాలిని ఏఎన్ఐతో అన్నారు. "ఇది మమ్మల్ని చాలా సంతోషపరుస్తుంది, యావత్ దేశం సంతోషంగా ఉంది. ఇది ముందే వచ్చి ఉంటే, ధర్మేంద్రజీ చాలా సంతోషించేవారు. ఆయన్ని చూసి అభిమానులు మరింత సంతోషించేవారు." అని ఆమె అన్నారు.

**హర్మన్‌ప్రీత్ కౌర్‌కు పద్మశ్రీ పురస్కారం**
కళల విభాగంలో ఎన్. రాజమ్ పద్మ విభూషణ్ పౌర పురస్కారాన్ని అందుకున్నారు. ప్రజావ్యవహారాల విభాగంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీ, కళల విభాగంలో ఆర్. గణేశ్, వాణిజ్యం-పరిశ్రమలు విభాగంలో ఉదయ్ కోటక్‌లు రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ భూషణ్



అవార్డును అందుకున్నారు. ప్రజావ్యవహారాల విభాగంలో మరణాంతరం వీకే మల్హోత్రాకు పద్మ భూషణ్ ప్రకటించగా, ఆయన కుమారుడు పురస్కారాన్ని అందుకున్నారు. క్రీడల విభాగంలో భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.
మెడిసెన్ విభాగంలో తెలంగాణకు చెందిన వైద్యులు గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి పద్మ అవార్డులు అందుకున్నారు. కళల విభాగంలో దీపికా రెడ్డి పద్మ అవార్డు అందుకోగా సాహిత్యం- విద్య విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెంపటి కుటుంబ శాస్త్రి పద్మ పురస్కారాన్ని అందుకున్నారు. కళల విభాగంలో మరణానంతరం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌కు పద్మ అవార్డు ప్రకటించగా ఆయన కుమారుడు పురస్కారాన్ని అందుకున్నారు.
గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 2026 సంవత్సరానికి సంబంధించిన పద్మ పురస్కార గ్రహీతల అధికారిక జాబితాను ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. మొత్తం 113 పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం, వారిలో 45 మంది అన్‌సంగ్ హీరోలను ఎంపిక చేసింది. 2026 సంవత్సరానికిగానూ మొత్తం 131 పద్మ పురస్కారాల ప్రదానానికి రాష్ట్రపతి ఆమోదం తెలుపగా, మిగతా అవార్డులను రెండో విడత జరిగే కార్యక్రమంలో అందజేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. కళలు, సాహిత్యం, సామాజిక సేవ, వైద్యం, విద్య, ప్రజా సేవ వంటి వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు సమాజానికి అందించిన విశిష్ట సేవలు, అంకితభావం, దీర్ఘకాలిక కృషిని గుర్తించి ఈ ప్రతిష్టాత్మక పౌర పురస్కారాలను అందజేస్తారు.

**పద్మవిభూషణ్**
ధర్మేంద్రకు మరణానంతరం పద్మవిభూషణ్,అచ్యుతానందన్(కేరళ)కు మరణానంతరం పద్మవిభూషణ్,కె.టి.థామస్(కేరళ)కు పద్మవిభూషణ్ సాహితీవేత్త పి.నారాయణన్(కేరళ)కు పద్మవిభూషణ్,కళల విభాగంలో ఎన్.రాజాం(ఉత్తరప్రదేశ్)కు పద్మవిభూషణ్.

**పద్మభూషణ్**
నోరీ దత్తాత్రేయుడు (వైద్యం)- అమెరికా,మమ్ముట్టి (కళలు)- కేరళ,అల్కా యాజ్ఞిక్ (కళలు)- మహారాష్ట్ర,కల్లిపట్టి రామసామి పళనిస్వామి (వైద్యం)- తమిళనాడు,
పీయూష్ పాండే (మరణాంతరం) (కళలు)- మహారాష్ట్ర,ఎస్‌కేఎం మెయిలానందన్ (సామాజిక సేవ)- తమిళనాడు,శతావధాని ఆర్ గణేశ్ (కళలు)- కర్ణాటక,
శిబూ సోరెన్ (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- ఝార్ఖండ్,ఉదయ్ కొటక్ (వాణిజ్యం-పరిశ్రమలు)- మహారాష్ట్ర,వీకే మల్హోత్రా (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)- ఢిల్లీ,వెల్లప్పల్లి నటేశన్ (ప్రజావ్యవహారాలు)- కేరళ,
విజయ్ అమృత్‌రాజ్ (క్రీడలు)- అమెరికా,భగత్‌సింగ్ కోశ్యారీ (ప్రజావ్యవహారాలు)- ఉత్తరాఖండ్.

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

## పదిరోజుల్లో నాలుగోసారి

3లో..

# నిందితులను న్యాయవ్యవస్థే రక్షిస్తోందన్న ప్రచారం

- మాకు బాధ కలిగించింది : సుప్రీంకోర్టు

**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో:**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నటి ట్విషా శర్మ మృతి కేసు దర్యాప్తు జరుగుతున్న తీరుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నిందితులను న్యాయవ్యవస్థే రక్షిస్తోందన్న ప్రచారం తమకు బాధ కలిగించిందని తెలిపింది. అలాగే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడం సరైన చర్యేనని అభిప్రాయపడింది. ఈ కేసు పరిణామాలను రిపోర్టింగ్ చేసేటప్పుడు మీడియా అత్యంత సంయమనం పాటించాలని సూచించింది. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేలా చూస్తామని తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్? జాయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. అటు మీడియా జోక్యం వల్లే ఈ కేసు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించగలిగామన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. బాధితురాలు లేదా నిందితుల కుటుంబ సభ్యులు ఇచ్చే ప్రకటనలను ప్రసారం చేయవద్దని మీడియా సంస్థలను ఆదేశించింది. వారి వద్దకు వెళ్లి వివరాలను రికార్డ్ చేయవద్దని, ఈ కేసులో ఎలాంటి ముందస్తు కథనాలకు తావివ్వకూడదని పేర్కొంది. బాధితురాలి కుటుంబ సభ్యుల వద్ద ఉన్న సమాచారాన్ని దర్యాప్తు సంస్థల ముందు మాత్రమే రికార్డ్ చేయించాలని, తద్వారా కొనసాగుతున్న విచారణపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా ఉంటుందని పేర్కొంది. భవిష్యత్తులో కోర్టులో కీలక సాక్షులుగా మారే అవకాశం ఉన్న వ్యక్తుల నుంచి సాక్ష్యాలు రికార్డ్ చేయవద్దని సూచించింది. ప్రజలు కూడా ఈ కేసుపై ఎలాంటి అంచనాలకు రావద్దని, దర్యాప్తు సంస్థలపై నమ్మకం ఉంచాలని కోరింది. మరోవైపు మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఒక సందేశమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను ఎదుర్కోవడం కంటే ఆ కుమార్తెకు విడాకులు ఇప్పించడమే మంచిదని అన్నారు. మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఎయిమ్స్-భోపాల్ బృందం ఆదివారం ట్విషా మృతదేహానికి రెండో పోస్ట్‌మార్టం నిర్వహించిందని సొలిసిటర్ జనరల్ తెలిపారు.



**సీబీఐ చేతికి కేసు**
మరోవైపు, ట్విషా శర్మ మరణంపై దర్యాప్తును సి బి ఐ చేపట్టనుందని అధికారులు సోమవారం వెల్లడించారు. ఈ దర్యాప్తు కోసం ఆ సంస్థ ఇప్పటికే ఒక బృందాన్ని భోపాల్‌కు పంపింది. రాష్ట్ర పోలీసుల నుంచి ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను స్వీకరించి, దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలను సేకరిస్తుందని వారు పేర్కొన్నారు. సి బి ఐ వెంటనే ఈ కేసు దర్యాప్తును చేపట్టేలా చూసేందుకు, తాను సంబంధిత అధికారులతో మాట్లాడతానని సొలిసిటర్ జనరల్ చేసిన విన్నపాన్ని అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. మే నెల ప్రారంభంలో మధ్యప్రదేశ్? భోపాల్‌లోని అత్తింట్లో ట్విషా అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయింది. అప్పటికి ఆమెకు పెళ్లై ఐదు నెలలే. మృతి చెందడానికి ముందు తన తల్లి, స్నేహితురాలికి ఆమె పలు సందేశాలు పంపినట్లు వార్తలు వచ్చాయి. తాను వేధింపులకు గురవుతున్నానని, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, తన జీవితం నరకంలా మారిందని, తాను ఈ వివాహ బంధంలో చిక్కుకుపోయానని వాటిల్లో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయితే, ట్విషా భర్త న్యాయవాది కాగా, అత్త విశ్రాంత న్యాయమూర్తి. వరకట్నం కోసం వారు వేధించారని, ఆత్మహత్యకు పురిగొల్పారని, ఫలితంగా ఈ కేసును ప్రభావితం చేస్తున్నారంటూ మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు వెంటనే రెండోసారి శవ పరీక్షకు ఆదేశించడాన్ని ఈ విచారణ సందర్భంగా సుప్రీం ప్రశంసించింది.



## కెజిబివిలో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు

- హాజరైన చైర్మెన్

**టీ మీడియా ,మే 25,పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలోని పీఎం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ లో విద్యార్థినుల నైపుణ్యాల పెంపునకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ (వేసవి శిక్షణా తరగతులు) ముగింపు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు ఇలాంటి వేసవి శిబిరాల్లో నేర్చుకునే వివిధ రకాల నైపుణ్యాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కేజీబీవీల్లో ఇలాంటి ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోందని కొనియాడారు ఈ క్యాంపును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థినులను వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను కేజీబీవీ ప్రత్యేక అధికారిని సిబ్బందిని చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు . ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి ,మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు దాసరి జములమ్మ, శివ సాయి, భాగ్యలక్ష్మి ,శివ ,ఎంఈఓ జయరాములు ,ఎఫ్ఏఓ ఉమాదేవి ,జిఈసిఓ ఇంద్రవేణి, స్పెషల్ ఆఫీసర్ పద్మ ,ప్రభుత్వ బాలుర ప్రధానోపాధ్యాయుడు నరసింహ గౌడ్ ,పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలి

- శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి

**టీ మీడియా, మే 25, వనపర్తి బ్యూరో :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జూన్, 25 నుండి ప్రారంభమైన మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి కొత్తకోట బస్టాండ్ లో దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన మహిళా సంఘాల రెండు ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అదే బస్సులో మహిళా సంఘాల సభ్యులతో కలిసి మిరాస్ పల్లి వరకు ప్రయాణించి మిరాస్ పల్లి జాతీయ రహదారిపై మహిళా సంఘాలకు ప్రభుత్వ సబ్సిడీ పై రూ. 2.00 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిన భారత్ పెట్రోలియం బంక్ కు భూమి పూజ చేశారు. అనంతరం శాసన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ఒకప్పుడు మహిళలు కేవలం పొదుపు చర్యలకు మాత్రమే పరిమితం అమయ్యేదని కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి అనేక సంక్షేమ పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అందజేయడం జరుగుతుందన్నారు.



ఈరోజు మహిళా సంఘాలకు సంబంధించిన పెట్రోల్ బంక్ భూమి పూజ, బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారిపై ఎంతో విలువైన ఒక ఎకరం భూమిని తన నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే 90 రోజుల్లో పెట్రోల్ బంక్ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు జిల్లా యంత్రాంగం చేయుతనందిస్తుందని తెలిపారు. అందులో భాగంగా భారత్ పెట్రోలియం సంస్థతో ఒప్పందం చేసుకొని రూ. 3.00 కోట్ల విలువైన ఎకరం స్థలాన్ని మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు కేటాయించడం జరిగిందన్నారు. 2 కోట్ల అంచనా వ్యయంతో భారత్ పెట్రోలియం సంస్థ వారు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తుందన్నారు. పి.డి.డి.ఆర్డీఓ ఉమాదేవి, భరత్ పెట్రోలియం ట్రేడింగ్ మేనేజర్ శఫాలి సింగ్, ఇంజనీరింగ్ సింగ్, ఇంజనీరింగ్ మేనేజర్ అభిషేక్ సింగ్, మదనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఇతర ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నాటక, తెలంగాణ మధ్య 'చెత్త' వివాదం..

- 'డెత్ జోన్'గా సరిహద్దు

**టి మీడియా, మే 25, న్యాల్కల్ :**
తెలంగాణ- కర్నాటక బోర్డర్‌లోని న్యాల్కల్ మండలం మల్గి గ్రామ సరిహద్దు ఇప్పుడు ఒక 'డెత్ జోన్'గా మారుతోంది. కర్నాటకలోని బీదర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిరోజూ తరలిస్తున్న టన్నుల కొద్దీ వ్యర్థాలు ఇక్కడి పర్యావరణాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. బీదర్‌కి చెందిన సుల్తాన్‌పూర్ డంపింగ్ యార్డ్ సరిగ్గా తెలంగాణ బోర్డర్ గ్రామాలకు ఆనుకుని ఉంది. నిబంధనల ప్రకారం చెత్తను రీసైక్లింగ్ చేయాల్సిన మున్సిపాలిటీ.. ఇక్కడ బహిరంగంగా చెత్తకు నిప్పు పెడుతోంది. ఆ విషపూరిత పొగ మల్గి, పరిసర గ్రామాలను కమ్మేస్తోంది. ప్రతిరోజూ బీదర్ మున్సిపాలిటీ నుంచి సుమారు 40 టన్నులకు పైగా చెత్తను సేకరించి సుల్తాన్‌పూర్ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తారు. అయితే, ఈ వాహనాలన్నీ తెలంగాణ పరిధిలోని మల్గి గ్రామం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రయాణంలో వాహనాల నుంచి కుళ్ళిన మురుగునీరు రోడ్లపై కారుతూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. చెత్త వాహనాల నుంచి లీకవుతున్న మురుగునీరు పంట పొలాలను సైతం కలుషితం చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు డంపింగ్ యార్డులో అక్రమంగా చెత్తను తగలబెడుతుండటంతో సరిహద్దు ప్రజలు ఊపిరాడక అల్లాడిపోతున్నారు. ఈ డంపింగ్ యార్డ్ వల్ల కుక్కల బెడద కూడా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. పొరుగు రాష్ట్రం చేస్తున్న పర్యావరణ నేరానికి తాము బలికావాలా అంటూ మల్గి గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఒక్క చెత్త బండిని కూడా పోనివ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో బీదర్ నగరంలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అయితే రంగంలోకి దిగిన కర్నాటక మున్సిపల్ అధికారులు, బీదర్ పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేయాల్సింది పోయి.. బెదిరింపులకు దిగడం ఇక్కడ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వేరే ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ, కావాలనే తమ ఊరిని నాశనం చేయడానికి ఈ రూట్‌ను ఎంచుకుంటున్నారని మల్గి గ్రామస్తులు మండిపడుతున్నారు. బీదర్ మున్సిపాలిటీ వ్యర్థాల రీసైక్లింగ్ కోసం సుల్తాన్‌పూర్ లో 'వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్' నిర్మిస్తామని ఏళ్ల క్రితం ప్రకటించినా, అది నేటికీ కాగితాలకే పరిమితమైంది. ఇప్పటికైనా సంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు, తెలంగాణ ప్రభుత్వం వెంటనే.. కర్నాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి, మల్గి రూట్ నుంచి చెత్త తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు. మరి అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపుతారో లేదో చూడాలి.





# గుణపాఠాలు నేర్చుకోవడం లేదు

- నీట్ పేపర్ లీక్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో :**
దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. గతంలో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎన్టీఏ, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ అలోక్ ఆరాధే నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. గతంలో కూడా ఇదే అంశం సుప్రీంకోర్టు దృష్టికి వచ్చిందని, అప్పట్లో కోర్టు సూచనల మేరకు మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేసింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు అమలయ్యాయా లేదా అన్న విషయంపై ఎన్టీఏ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గురువారం లోపు ఆ నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "ఇది బాధాకరం. గత ఘటనల నుంచి వారు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు. ఈ అంశం ఇప్పటికే కోర్టు ముందుకు వచ్చింది. అప్పట్లో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ పలు సూచనలు చేసింది. ఇప్పుడు ఆ సూచనల అమలుపై స్పష్టత కావాలి" అని కోర్టు పేర్కొంది.

ఈ వ్యవహారంపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా), యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. నీట్ పరీక్ష నిర్వహణలో వరుసగా జరుగుతున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయని పిటిషనర్లు వాదించారు. ఈ నేపథ్యంలో ఎన్టీఏను పూర్తిగా పునర్వ్యవస్థీకరించాలని లేదా దాని స్థానంలో స్వతంత్ర, పారదర్శక సంస్థను ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయ్యిందన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పరీక్షను ఎన్టీఏ నిర్వహించింది. అయితే లీక్ ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో మే 12న పరీక్షను రద్దు చేశారు. ప్రస్తుతం ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తోంది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఇప్పటికే 22 లక్షలకుపైగా విద్యార్థులు ఈ వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని పేర్కొన్నారు. వరుసగా జరుగుతున్న లీక్ ఘటనలు విద్యార్థుల ప్రాథమిక హక్కులపై నేరుగా దాడి చేసినట్లేనని వాదించారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. ఇంకా, మళ్లీ నిర్వహించే పరీక్షలను ఒక హైపవర్ కమిటీ పర్యవేక్షణలో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు.

ఆ కమిటీలో మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఛైర్మన్‌గా నియమించాలని, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు, ఫోరెన్సిక్ శాస్త్రవేత్తలను సభ్యులుగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరగకుండా అడ్డుకోవచ్చని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి మాజీ ఇస్రో ఛైర్మన్ కె. రాధాకృష్ణన్ నేతృత్వం వహించిన విషయాన్ని కోర్టు గుర్తుచేసింది. ఆ కమిటీ సూచనల అమలుపై కూడా వివరాలు ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. "కోర్టు ఇచ్చిన ఆదేశాల అమలు పరిస్థితిని తెలియజేస్తూ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్‌గా కె. రాధాకృష్ణన్ నివేదిక సమర్పించాలి" అని పేర్కొంది. నీట్ పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత అంశాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశాల కోసం ఈ పరీక్ష రాస్తుంటారు. ఇలాంటి కీలక పరీక్షల్లో వరుసగా లీక్ ఆరోపణలు రావడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది. ఇప్పటికే ఈ అంశంపై రాజకీయ విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు, పరీక్షా విధానాన్ని పూర్తిగా డిజిటల్, సురక్షిత పద్ధతిలోకి మార్చాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో గురువారం మళ్లీ విచారణ జరగనుంది. అప్పటికి ఎన్టీఏ సమర్పించే అఫిడవిట్, కేంద్ర ప్రభుత్వం స్పందనపై సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# 6 నెలలుగా రెక్కీ, పలుమార్లు ఫెయిల్

- పక్కా ప్లానింగ్‌తో న్యాయవాది మొహిజుద్దీన్ హత్య

**టి మీడియా, మే 25, హైదరాబాద్ బ్యూరో :**
హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. న్యాయవాది హత్యకు ముందే సుపారీ గ్యాంగ్ 10 లక్షలు తీసుకున్నట్లు గుర్తించారు. ఐదుగురు సభ్యుల ముఠా హత్యకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులు గోవాకు పరారయ్యారనే సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టారు.

**రూ.10 లక్షలు సుపారీ ఇచ్చి**
రాష్ట్ర రాజధానిలో సంచలనం రేకెత్తించిన వక్ఫ్ బోర్డు ప్యానల్ న్యాయవాది, మాసబ్ ట్యాంక్‌కు చెందిన ఖాజా మొహిజుద్దీన్ హత్య సుపారీ గ్యాంగ్ పనే అని తెలుస్తోంది. ఐదుగురు సభ్యులున్న ముఠా దారుణానికి తెగబడినట్టు, ఇందుకోసం కిషన్ అనే వ్యక్తి కవాడిగూడకు చెందిన వినయ్‌కు 10 లక్షలకు సుపారీ ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. వీరు కొన్నినెలల క్రితమే న్యాయవాది హత్యకు పథక రచన చేసినట్లు సమాచారం. న్యాయవాది ఇంటి వద్ద పలుమార్లు రెక్కీ నిర్వహించి విఫలమై ఈ దఫా పక్కా ప్రణాళికతో ముఠా సభ్యులను రంగంలోకి దింపినట్లు గుర్తించారు. న్యాయవాది హత్య కోసం నిందితుడు వినయ్ సెకండ్ హ్యాండ్ కారు కొన్నట్లు సమాచారం. నిత్యం మొహిజుద్దీన్ కదలికలను గమనిస్తూ గురి తప్పకుండా ఢీకొట్టేలా రెక్కీ చేసినట్టు తెలిసింది.



**గోవా పారిపోయిన నిందితులు**
మూడు రోజులుగా శాంతినగర్‌లోని న్యాయవాది నివాసప్రాంతంలో నిందితులు కారు పార్కు చేసి రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. శనివారం తెల్లవారుజామున ఆయన స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు కారు వద్దకు వచ్చి డోర్ తీస్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా ఢీకొట్టారు. హత్యకు ఉపయోగించిన కారును ఆరు నెలల క్రితమే కొనుగోలు చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో వినయ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన మరో నలుగురు నిందితులు గోవా పారిపోయినట్లు సమాచారంతో వారి కోసం పోలీసు బృందాలు అక్కడకు వెళ్లి గాలిస్తున్నాయి.

**వివాదాలే హత్యకు కారణమా..?**
వక్ఫ్ ఆస్తులను ఆక్రమించి విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన వివాదంపై న్యాయవాది మొహిజుద్దీన్ న్యాయపోరాటం చేస్తున్నారు. కొన్నేళ్లుగా దీనికి సంబంధించి చోటుచేసుకున్న వివాదాలే హత్యకు ప్రధాన కారణమని పోలీసులు అంచనాకు వచ్చారు. న్యాయవాది కుమారుడు ఫర్హాన్ ఇచ్చిన ఫిర్యాదుతో ముజాహిద్ ఆలం ఖాన్, మహబూబ్ ఆలం ఖాన్‌లపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెంగళూరులో ఉన్న వీరిద్దరినీ హైదరాబాద్ రప్పించి వివరాలు రాబట్టారు. నిందితులకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని న్యాయవాది కుమారుడు ఫర్హాన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్‌లు ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని దాని యజమాని కోసం ఆరా తీస్తున్నారు. ఆరు నెలల క్రితమే విక్రయించినా కారు రిజిస్ట్రేషన్ చేయకపోవటంపై వివరాలు రాబడుతున్నారు.

# వృద్ధ తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**టీ మీడియా, మే 25, వనపర్తి బ్యూరో :**
సమాజంలో వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధించడం వంటి అమానుష ఘటనలను ఏమాత్రం సహించబోమని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు. కన్నతండ్రి ఆస్తులను తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకొని వృద్ధాప్యంలో అన్నం పెట్టకుండా, ఇంటికి రానీయకుండా వేధించిన ఇద్దరు కుమారులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని మెట్టుపల్లికి చెందిన వృద్ధుడు రంగం హనుమన్న జిల్లా ఎస్పీ సునీత రెడ్డిని కలిసి తన గోడును వినిపించారు. హనుమన్నకు ముగ్గురు కుమారులు ఉండగా, అందులో ఒకరైన బాలాజీ అనారోగ్యంతో మరణించారని, మిగిలిన ఇద్దరు కుమారులు చిన్న కృష్ణయ్య (హోంగార్డ్), రాములు (బంగారు వ్యాపారి) తన పేరు మీద ఉన్న భూమిని మొత్తం తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకొని ప్రస్తుతం తనను ఇంటికి రానీయకుండా, అన్నం పెట్టకుండా, శారీరకంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వృద్ధుడి బాధను విన్న జిల్లా ఎస్పీ వెంటనే స్పందించి హనుమన్నను ఓదార్చి, అతనికి పూర్తి న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేయించి చట్టపరమైన చర్యలకు ఆదేశించారు. అంతేకాకుండా వృద్ధుడి పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించిన ఎస్పీ ఆయనను వృద్ధాశ్రమంలో చేర్పించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు జీవితాంతం పిల్లల కోసం కష్టపడతారు. అలాంటి వృద్ధులను ఆస్తుల కోసం వేధించడం, నిర్లక్ష్యం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. వృద్ధులపై ఎలాంటి వేధింపులు జరిగినా పోలీసుశాఖ వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటుంది.




సమాజంలో పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత కన్నతల్లిదండ్రులను వేధించడం, ఇంటి నుంచి వెళ్లగొట్టడం, ఆస్తుల కోసం హింసించడం వంటి అమానుష చర్యలను సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. జీవితాంతం పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో అవమానించడం మానవత్వానికే మచ్చ. ఆస్తులను తమ పేర్లపై రాయించుకొని తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వృద్ధులపై శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వేధింపులకు పాల్పడే వారెవరైనా ఎంతటి వారైనా ఉపేక్షించము. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలి. వృద్ధుల భద్రత, సంక్షేమం కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు.



## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**టి మీడియా , మే 25, భద్రాద్రి కొత్త గూడెం:**
జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు.

సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వేడుకలు ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, వేదిక అలంకరణ, కుర్చీలు, ధ్వని వ్యవస్థ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సజావుగా జరిగేలా అన్ని శాఖలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా దేవర్ల కార్తీక్

**టీ మీడియా, మే 25, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కరీంనగర్లో ఈనెల 22,23, 24 నా నిర్వహించిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గాలో ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ గా దేవర్ల కార్తీక్ ను రాష్ట్ర అధ్యక్షులు రావుల కృష్ణ గారు ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కార్తీక్ మాట్లాడుతూ నా మీద నమ్మకం ఉంచి వనపర్తి జిల్లా కన్వీనర్ గా బాధ్యతలు ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యారంగ సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి విద్యారంగ సమాస్యలు ఉన్న ఏబీవీపీ దృష్టికి తీసుకు రాగలరని అన్నారు. జిల్లా కన్వీనర్ బాధ్యతపై తోటి స్నేహితులు, ఏబీవీపీ నాయకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



# ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

• **అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి గొట్టిపాటి**

**టి మీడియా, మే 25, బాపట్ల :**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. రాష్ట్రమంతా భానుడి భగభగలకు మండిపోతుంటే మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. భారీగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. బాపట్ల జిల్లాలోని అమృతలూరులో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన ఆకాల వర్షం బీభత్సం సృష్టించింది. దాంతో గ్రామదేవత ఆలయ ప్రాంగణంలోని వేపచెట్టు ఈదురు గాలులకు విరిగిపోయి విద్యుత్తు లైన్లు, తెనాలి చెరుకుపల్లి అర్ అం డ్ బీ రోడ్డుపై పడింది. మూడు స్తంభాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ తీగలు సైతం తెగిపోయాయి.

**అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థ**

ఫలితంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్లు, విద్యుత్తు స్తంభాలు రోడ్డుపై అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులు వాహనాలను విద్యుత్తు శాఖ సిబ్బంది వేరే మార్గంలో మళ్లించారు. రహదారిపై అడ్డుగా పడిన విద్యుత్తు లైన్లు, స్తంభాలు, చెట్లును తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఫలితంగా గ్రామంలో అంధకారం నెలకొంది.

**పరిస్థితిపై ఆరా తీసిన మంత్రి గొట్టిపాటి**

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన పరిస్థితిపై



విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి అధికారులతో ఫోన్?లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. గాలుల తీవ్రతకు చెట్లు, డిస్‌ప్లే హోర్డింగ్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడటంతోనే సరఫరా నిలిచిపోయిందని అధికారులు మంత్రికి వివరించారు. ఎక్కడికక్కడ లైన్లను క్లియర్ చేస్తూ పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు.

**సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం**


వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా, సిబ్బంది భద్రతను చూసుకుంటూ పనులు ముగించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి వీలైనంత త్వరగా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ అధికారులకు స్పష్టం చేశారు.

**కర్నూలు జిల్లాలో సైతం**

కర్నూలులో వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు చెట్లు నేలకొరిగాయి. కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పలు భారీ చెట్లు కూలిపోయాయి. ఫలితంగా విద్యుత్ వ్యవస్థ?కు తీవ్ర అంతరాయం కలిగింది. కూలిన చెట్లు కారు, ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. కలెక్టర్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రం, చలువ పందిరి సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి.

# రోహిణి కార్తె వచ్చేసింది..

• **బయటకు వెళ్తే నిప్పుల వర్షమే..!**




**టి మీడియా, మే 25, హైదరాబాద్ బ్యూరో :**

రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయంటారు. ఎండాకాలంలో అత్యంత భయంకరమైన ఎండలు ఉండేది ఇప్పుడే. ఈ సమయంలోనే భరించలేని ఉక్కబోత, తట్టుకోలేని ఎండలూ ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఎండాకాలంలో హయ్యస్ట్ హీట్ ఇప్పుడే ఉంటుంది. అలాంటి డేంజర్ రోహిణి కార్తె.. ఇవాళ్టి నుంచే ప్రారంభంకాబోతోంది. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం.. సూర్యుడు సోమవారం రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. జూన్ 8వ తేదీ వరకు అక్కడే ఉంటాడు. ఈ పక్షం రోజులు ఎండలు తీవ్రంగా ఉంటాయి. వేసవి కాలంలో వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే.. రోహిణి కార్తె సమయంలో మాత్రం మరింత ఎక్కువగాఉంటాయి.. ఈ కాలంలో సూర్య భగవానుడు భగ భగ మండిపోతూ ఉంటాడని పేర్కొంటారు. ఈ పక్షం రోజుల్లో సూర్యుడి తీవ్రత తీవ్ర స్థాయికి చేరుకుని, కొద్ది కొద్దిగా తగ్గుతూ వస్తుందని పేర్కొంటున్నారు.వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో ఎండలు అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. ఇంటి నుంచి అడుగు బయటపెట్టాలంటేనే భయపడేలా భానుడి భగభగలు భయపెడుతున్నాయి. చాలాచోట్ల ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటేసి.. 49, 50 డిగ్రీల వైపు దూసుకెళ్తున్నాయి. మరి, ఇప్పుడు రోహిణి కార్తెతో.. ఆ రికార్డు రీచ్ అయిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. పొద్దున్నే తొమ్మిది గంటల నుంచి భాస్కరుడు తన వేడి సెగలను భూమిపైకి విసురుతున్నాడు. మధ్యాహ్నానికి ఎంత తీవ్రత మరింత పెరుగుతుంది.. ఎండ తీవ్రతో జనం పిట్టల్లా రాలిపోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే పదుల సంఖ్యలో జనం వడదెబ్బతో చనిపోయారు. అయితే.. వచ్చే వారం కూడా ఎంత తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది.ఇదిలాఉంటే.. నిన్న ఏపీలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాలాచోట్ల టెంపరేచర్స్ 48 డిగ్రీలు దాటేశాయి. తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదైంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో.. అలాగే పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1 డిగ్రీలు రికార్డైంది. 17 జిల్లాల్లోని 174 మండలాల్లో 44 డిగ్రీలు దాటాయి. మరో నాలుగైదు రోజులు తీవ్రస్థాయిలో ఎండలు, వడగాలులుతెలంగాణలో అత్యధికంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాదాపు అన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అయితే.. వడగాల్పుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని .. జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# అన్నాడీఎంకేలో ముసలం

(మొదటిపేజీ తరువాయి...)

విప్‌ను ధిక్కరించి, ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేసిన 25 మంది తిరుగుబాటు ఎమ్మెల్యేల్లో ఈ ముగ్గురు కూడా ఉన్నారు.

**తిరిగి పళనిస్వామి వర్గంలో చేరిన ఐదుగురు ఎమ్మెల్యేలు**

ఇదిలా ఉండగా, షణ్ముగం- వేలుమణి వర్గంలో ఉన్న ఐదుగురుఅన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తిరిగి పార్టీ అధినేత పళనిస్వామి వైపు మళ్లారు. దీంతో అసెంబ్లీలో పళనిస్వామికి మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేల సంఖ్య 27కు చేరింది. అసమ్మతి వర్గాన్ని వీడిన శాసనసభ్యుల్లో ఎస్.ఎం. సుకుమార్ (ఆర్కాట్) కూడా ఉన్నారు. మొత్తంగా ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలు, ఐదుగురు ఎమ్మెల్యేలు తిరిగి పళనిస్వామి వర్గంలోకి వెళ్లడంతో రెబల్ వర్గం బలం ఇప్పుడు 25 నుంచి 17కు తగ్గిపోయింది. ఆ ఐదుగురు ఎమ్మెల్యేల్లో అంతియూర్ నుంచి గెలిచిన పి. హరిభాస్కర్, శంకరన్‌కోయిల్ శాసనసభ్యుడు దిలీపన్ జైశంకర్, కాంగేయం నుంచి గెలిచిన ఎన్.ఎస్.ఎన్. నటరాజన్, పన్రుట్టి నుంచి గెలిచిన కె. మోహన్ ఉన్నారు.

ఐదుగురు ఎమ్మెల్యేలు గ్రీన్‌వేస్ రోడ్‌లో ఉన్న పళనిస్వామి నివాసానికి వెళ్లి, తిరిగి పార్టీలో విలీనమయ్యారు. అనంతరం స్పీకర్ ప్రభాకర్‌ను కలిసి, తాము పళనిస్వామి నాయకత్వంలోనే పనిచేస్తామని పేర్కొంటూ ఒక లేఖను సమర్పించారు. "అసెంబ్లీలో జరిగిన బలపరీక్ష సమయంలో జరిగిన కొన్ని పొరపాట్ల పట్ల చింతిస్తున్నామని తెలియజేస్తూ మా ప్రధాన కార్యదర్శికి ఒక లేఖ ఇచ్చాము. మేమందరం (ఐదుగురం) ఆయన నాయకత్వంలోనే పనిచేస్తామని చెప్పి, తిరిగిఅన్నాడీఎంకే లో చేరాము." అని సుకుమార్ తెలిపారు. ఆ లేఖను ఐదుగురు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు కూడా అందజేశారని సుకుమార్ వివరించారు.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన 21 రోజుల్లోనే అన్నాడీఎంకే లో ఈ రాజీనామాలు, చీలిక సంభవించాయి. ఎన్నికల అనంతర పరిణామాల్లో ఇదిఅన్నాడీఎంకే కి ఒక పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. షణ్ముగం పార్టీ విప్‌ను ధిక్కరించారని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి ఆరోపించారు. దానికి ప్రతిగా షణ్ముగం ఈపీఎస్ నియమించిన విప్ అధికారాన్ని ప్రశ్నించారు. తాజా పరిణామాలపై విలేకరులు షణ్ముగం స్పందన కోరగా, తర్వాత మాట్లాడుతామంటూ దాటవేశారు.కాగా, ఏఐఏడీఎంకే సీనియర్ నాయకుడు ఎస్. సెమ్మలై సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలోని ఇటీవలి పరిణామాలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పార్టీ ప్రస్తుత పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆయన తన రాజీనామా లేఖను ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామికి సమర్పించారు. ఎన్నికల తర్వాత పార్టీలో జరిగిన వరుస ఘటనలు తనకు తీవ్రమైన మానసిక వేదనను కలిగించాయని తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు కూడా ఇలాంటి ఆందోళనలనే ఎదుర్కొంటున్నారని తెలిపారు.తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 సీట్లను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచింది. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. అనంతరం కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల మద్దతుతో విజయ్ తమిళనాడు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపణ సమయంలో అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించడంతో విజయ్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య 144కి పెరిగింది.

# మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

## పదిరోజుల్లో నాలుగోసారి

**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో:**



దేశ ప్రజలకు మరోసారి ఇంధన ధరల షాక్ తగిలింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు సోమవారం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచాయి. పెట్రోల్‌పై లీటరుకు రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు అమల్లోకి తీసుకొచ్చాయి. కేవలం పదిరోజుల్లోనే నాలుగోసారి ఇంధన ధరల పెంపు కావడం గమనార్హం. మే 15 నుంచి ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు దాదాపు రూ.7.5 వరకు పెరిగాయి.

**కీలక నగరాల్లో ధరలు ఇలా!**

రాష్ట్ర ప్రభుత్వాల స్థానిక పన్నుల కారణంగా ధరల్లో ప్రాంతాలవారీగా తేడాలు ఉంటున్నాయి.
ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ ధర రూ.95.20,హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74,విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ ధర రూ.104.88,ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.21, డీజిల్: రూ.97.83,
కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.51, డీజిల్ ధర రూ.99.82,చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77, డీజిల్ ధర రూ.99.55,.రెండు వారాల్లో నాలుగు సార్లు పెంపునాలుగేళ్ల తర్వాత తొలిసారిగా మే 15న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను రూ.3 చొప్పున పెంచాయి. ఆ తర్వాత మే 19న లీటరుకు 90 పైసలు, మే 23న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెంచారు. ఇప్పుడు మరోసారి భారీ పెంపు అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు 2022 మే తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ధరలు దాదాపు స్థిరంగానే కొనసాగగా, 2024 మార్చిలో సాధారణ ఎన్నికలకు ముందు లీటరుకు రూ.2 తగ్గించారు. ఇప్పుడు వరుస పెంపులతో సామాన్యులపై భారీ భారం పడుతోంది.

**పెరుగుతున్న ముడి చమురు ధరలు**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, రూపాయి బలహీనపడటం, రిఫైనింగ్ ఖర్చులు అధికమవడం వల్ల దిగుమతి వ్యయం పెరిగిందని చమురు సంస్థలు చెబుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ ఉద్రిక్తతలు పెరగడం, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాలో అంతరాయాలు ఏర్పడటం వల్ల ఫిబ్రవరి చివరి నుంచి ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు 50 శాతం కంటే ఎక్కువ పెరిగినట్లు సమాచారం.

**ఎన్నికల తర్వాతే ధరల పెంపు?**

పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నప్పటికీ గత కొన్ని నెలలుగా ప్రభుత్వ రంగ సంస్థలు వినియోగదారులపై భారం వేయకుండా ధరలను నిలిపివేశాయి. అయితే ప్రతిపక్షాలు మాత్రం కీలక రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు కేంద్ర ప్రభుత్వం ధరల పెంపును ఆలస్యం చేసిందని ఆరోపిస్తున్నాయి. మే 15న జరిగిన మొదటి పెంపు, బీజేపీ పలు రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలు సాధించిన వెంటనే రావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

**ప్రైవేట్ కంపెనీలూ అదే దారిలో**

ప్రభుత్వ రంగ సంస్థల ధరల పెంపును ప్రైవేట్ చమురు కంపెనీలు కూడా అనుసరిస్తున్నాయి. నయారా ఎనర్జీ, షెల్, జియో-బీపీ వంటి సంస్థలు కూడా తమ పెట్రోల్ బంకుల్లో ధరలను పెంచాయి. నయారా ఎనర్జీ ఇప్పటికే మార్చిలో పెట్రోల్‌పై రూ.5, డీజిల్‌పై రూ.3 పెంచగా, షెల్ ఏప్రిల్ 1 నుంచి పెట్రోల్‌పై రూ.7.41, డీజిల్‌పై రూ.25 వరకు పెంపు చేసింది.

**సామాన్యులపై మరింత భారం**

తాజా ధరల పెంపుతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడనుంది. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలూ పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్, వ్యవసాయ రంగాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నగరాల్లో సీఎన్‌జీ, పీఎన్‌జీ ధరలు కూడా పెరగడంతో గృహ ఖర్చులు మరింత పెరిగే పరిస్థితి ఏర్పడింది.

# హైదరాబాద్ మెట్రోపై హక్కులు ప్రభుత్వానికి బదిలీ

• **రూ.13,600 కోట్లు రీఫైనాన్సింగ్**

**టి మీడియా, మే 25, హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం జరిగింది. నగర మెట్రో రైలుకు రూ.13,600 కోట్లు రీఫైనాన్సింగ్ చేసేందుకు ఐఆర్‌ఎఫ్‌సీతో ఎల్‌అండ్‌టీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. మెట్రో రైలు రీఫైనాన్స్ ఒప్పందంపై సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, సీఎస్ రామకృష్ణారావు సమక్షంలో ఢిల్లీలో ఒప్పందంపై సంతకాలు చేశారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల పద్ధతిలో రుణ సౌకర్యం కల్పిస్తున్నారు.

**మెట్రో కనెక్టివిటీతో ట్రాఫిక్ సమస్యలకు చెక్**

ఈ సందర్భంగా సీఎస్? మాట్లాడుతూ మెట్రో రైలు 100 శాతం యాజమాన్యం వాటా తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ అయినట్లు వెల్లడించారు. భాగ్యనగరంలో రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో హైదరాబాద్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని అన్నారు. రాజధాని నగరంలోని అనేక ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ పెరిగితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రయాణికులు సులభంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

**రాజధానిలో సమర్థవంతమైన ప్రజారవాణా**

మెట్రోకు సంబంధించిన రుణాలను రీఫైనాన్స్ చేసినందుకు సహకరించిన భారత ప్రభుత్వానికి, ఎల్?అండ్?టీ సంస్థకు,



ఐఆర్?ఎఫ్?సీ, హెచ్?ఎంఆర్?ఎల్ బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని నగరంలో సుస్థిరమైన, సమర్థవంతమైన ప్రజారవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

మొదటి దశ ప్రభుత్వపరం కావడంతో ఇక రెండో దశ పనులు మరింత వేగంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, రీ - ఫైనాన్సింగ్, రెండో దశ అభివృద్ధి పనుల పురోగతికి ఇది ఎంతగానో దోహదపడనుంది.రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో ఫేజ్ 2-ఏ : మెట్రో మొదటి దశ 3 కారిడార్లను (69 కి.మీ.) కవర్ చేస్తూ రూ. 22,000 కోట్లతో అమలు చేశారు. ఫేజ్ 2-ఏ లో భాగంగా మొత్తం 76.4 కి.మీల నూతన మార్గాన్ని నిర్మించనున్నారు. దీనిని రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 5 కారిడార్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.కారిడార్ 4: నాగోల్ నుంచి శంషాబాద్ ఆర్?జీఐఏ (ఎయిర్‌పోర్ట్ కారిడార్) వరకు 36.8 కి.మీ నిర్మించనున్నారు.కారిడార్ 5: రాయదుర్గ్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు 11.6 కి.మీ మేర మెట్రోను విస్తరించనున్నారు.కారిడార్ 6: ఎంజీబీఎస్? నుంచి చంద్రాయణగుట్ట (పాత నగర కారిడార్) వరకు 7.5 కి.మీ నిర్మించనున్నారు.కారిడార్ 7: మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4 కి.మీ నూతన మార్గం వేయనున్నారు.కారిడార్ 8: ఎల్బీనగర్ నుంచి హయత్?నగర్ వరకు 7.1 కి.మీ కొత్త మార్గం నిర్మించనున్నారు.

మూడు కారిడార్లతో ఫేజ్? 2-బీ : ఫేజ్ 2-బీ మొత్తం 86.1 కి.మీ. పొడవు గల మూడు కారిడార్లును నిర్మించనున్నారు. దీనికోసం రూ.19,579 కోట్ల అంచనా వ్యయంతో అందుబాటులోకి ఈ నూతన మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని చూస్తున్నారు.కారిడార్ 9 : ఆర్?జీఐఏ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ)కి 39.6 కి.మీ కొత్త మార్గం అందుబాటులోకి రానుంది.

కారిడార్ 10 : జేబీఎస్ న్యూ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ నూతన మార్గాన్ని నిర్మించనున్నారు.కారిడార్ 11 : జేబీఎస్ న్యూ నుంచి షామీర్‌పేట్ వరకు 22.0 కి.మీ కొత్త మార్గం నిర్మించనున్నారు.

# నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం

• **హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం**

**టి మీడియా, మే 25, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రానికి నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. రుతుపవనాలు తొలుత ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే నాలుగైదు రోజులు ఆలస్యంగా తీరాన్ని తాకే అవకాశం ఉందని తాజాగా తెలిపింది. తెలంగాణలోకి జూన్ 5 నుంచి 10 తేదీల్లో నైరుతి ప్రవేశించే అవకాశం ఉందని చెప్పింది. ఈ ఏడాది మాన్‌సూన్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం పడనుందని.. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో దీని ప్రభావం చూపనుందని వెల్లడించింది. దీంతో తెలంగాణలో లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**ఉరుములు, మెరుపులతో కూడిన వానలు**

రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలోని అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురవగా.. ఘట్‌కేసర్‌లో వడగాళ్ల వర్షం పడింది.



**విద్యుత్ సరఫరాకు అంతరాయం**

మెదక్? జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని గంగినేని థియేటర్ సమీపంలో రోడ్ జలమయమైంది. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్?కు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లాలోని ర్యాలమడుగు గ్రామంలో వర్షం కారణంగా ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నెలకొరిగింది. ఇదే తరహాలో మంభోజిపల్లి గ్రామంలో కురిసిన భారీ వర్షంతో పాటు ఈదురు గాలుల కారణంగా 3 విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**తడిసి ముద్దయిన వడ్లు**

వర్షం కారణంగా మెదక్ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం బస్తాలు తడిశాయి. మగ్దుంపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన 2 లారీల వడ్లు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

**ఈదురు గాలులకు చెట్లు నేలమట్టం**

సూర్యాపేట జిల్లాలోని పాలకవీడు మండలంలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆ ప్రాంతంలోని కొన్ని చోట్ల ఈదురు గాలులకు అనేక చెట్లు నేలమట్టం అయ్యాయి. ఒరిగిన విద్యుత్ స్తంబాలు, తెగిన విద్యుత్ వైర్లు కారణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.ఈదులుగాలుల కారణంగా జిల్లాలోని పాలకవీడు మండలం చెరువు తండా గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలి ఇంటి పైకప్పుగా ఉన్న రేకులు నేలమట్టం అయ్యాయి. దీంతో ఇంట్లోని సామాగ్రి తడిసి ముద్దయింది. దీంతోపాటు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా ఆస్తి నష్టం వాటిల్లింది.

# శానిటరీ ప్యాడ్స్, టాయిలెట్స్ లేవని బాలికలు చదువు ఆపేయకూడదు

• **సుప్రీంకోర్టు**

**టి మీడియా, మే 25, ఢిల్లీ బ్యూరో :**

పాఠశాలల్లో శానిటరీ ప్యాడ్స్?, ప్రత్యేక మరుగుదొడ్లు లేవనే ఒకే ఒక్క కారణంతో బాలికలు చదువు మధ్యలో వదిలేయకూడదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంపై తాము ఇచ్చే ఆదేశాలను అక్షరాలా, పూర్తి నిబద్ధతతో అమలు చేసేలా చూడాలని కేంద్రానికి స్పష్టం చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్?కిన్లు, బాలబాలికలకు విడివిడిగా ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని జనవరి 30న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీనితో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర ప్రభుత్వం తెలిపిన నేపథ్యంలో సోమవారం సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మరుగుదొడ్లను, శానిటరీ ప్యాడ్స్?ను చక్కగా ఉపయోగించుకోండి. ఇది ఈ దేశంలోని మహిళలు, బాలికల శ్రేయస్సు కోసం ఉద్దేశించింది. కేవలం ఇవి లేవనే కారణంతో బాలికలు చదువు ఆపేసి, ఇళ్లలోనే ఉండిపోయి ఇంటి పనులకు పరిమితం కాకూడదు" అని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్? మహదేవన్?లతో కూడిన సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్? జనరల్ అర్చన పాఠక్? దవేను ఉద్దేశించి, 'మా తీర్పు ప్రకారం, సదరు ప్రయోజనాలు అందరికీ అందేలా చూడడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత' అని సుప్రీంకోర్టు పేర్కొంది.

**ఫ్రీగా ఇవ్వాల్సిందే**

లింగ సమానత్వం, విద్యా హక్కు సమానత్వాన్ని నిర్ధరించడానికి జనవరి 30న సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా పర్యావరణానికి హాని చేయని (ఆక్సో-బయోడిగ్రేడబుల్) శానిటరీ న్యాప్?కిన్స్? అందించాలని స్పష్టం చేసింది. ?అలాగే విద్యార్థులు అందరికీ వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించింది. ప్రభుత్వ, ఎయిడెడ్?, ప్రైవేట్ పాఠశాలు అనే తేడా లేకుండా, అన్నింటిలోనూ ఈ సౌకర్యాలు కల్పించేలా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ ఆదేశాల అమలుకు సంబంధించిన నివేదికను లా ఆఫీసర్? అర్చన పాఠక్ దవే ఈ రోజు



సుప్రీంకోర్టుకు సమర్పించారు.దీనిని పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం, "మీరు అన్ని రాష్ట్రాల నుంచి సమాచారాన్ని (డేటా) సేకరిస్తున్నారా?" అని ప్రశ్నించింది. దీనికి అర్చన సమాధానం ఇస్తూ, రాష్ట్రాల నుంచి దాదాపు రెండు నుంచి రెండున్నర నెలల కాలానికి సంబంధించిన డేటాను కేంద్రం సేకరించిందని తెలిపారు. దీనితో తాము ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో పూర్తి నిబద్ధతో అమలయ్యేలా చూసేందుకు కేంద్రం మరింత చొరవ తీసుకోవాలని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది.ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నిరంతరం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకత్వం వహించాలి. మా ఆదేశాల అమలుకు సంబంధించి అవసరమైన డేటాను అన్ని రాష్ట్రాల నుంచి కేంద్రం క్రమం తప్పకుండా సేకరిస్తూ ఉండాలి" అని సుప్రీంకోర్టు సూచించింది. ఆ ఆదేశాల అమలును తాము ప్రతి మూడు నెలలకొకసారి పర్యవేక్షిస్తామని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో జరుగుతున్న ప్రగతిపై ప్రతి మూడు నెలలకొకసారి కేంద్ర ప్రభుత్వం కొత్త నివేదికను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది.ఇదే సమయంలో ఒక న్యాయవాది ఈ వ్యవహారానికి సంబంధించిన మధ్యంతర పిటిషన్?ను ప్రస్తావిస్తూ, కోర్టు తన తీర్పులో "ఆక్సో-బయోడిగ్రేడబుల్?" శానిటరీ న్యాప్?కిన్లు అనే పదాన్ని వాడిందని, అయితే అవి పర్యావరణానికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిని లా ఆఫీసర్? దృష్టికి తీసుకెళ్లాలని ధర్మాసనం సదరు న్యాయవాదికి సూచించింది. "ఈ మధ్యంతర దరఖాస్తును పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోండి" అని అర్చన పాఠక్? దవేకు సూచించింది. తదుపరి అమలు నివేదికను పరిశీలించడానికి సుప్రీంకోర్టు ఈ కేసును సెప్టెంబర్? 1వ తేదీకి వాయిదా వేసింది.

**ఆగస్టు 15లోగా సమర్పించాలి**

రాష్ట్రాలన్నీ తమ తాజా నివేదికలను ఆగస్టు 15లోగా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేంద్రానికి స్టేటస్ రిపోర్టులు సమర్పించడంలో ఏ రాష్ట్రం కూడా ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం చేయకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో తదుపరి అమలు నివేదికను దాఖలు చేయడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ నోడల్ మంత్రిత్వశాఖగా వ్యవహరిస్తుందని పేర్కొంది.

**ఆ తీర్పులో ఏం చెప్పింది?**

జనవరి 30న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "రాజ్యాంగంలోని ఆర్టికల్? 21 ప్రకారం జీవించే హక్కులో 'రుతుక్రమ ఆరోగ్యం' కూడా ఒక భాగం. సురక్షితమైన, సమర్థవంతమైన, సరసమైన రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ పద్ధతులు అందుబాటులో ఉంచడం వల్ల ఒక బాలిక అత్యుత్తమ లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని పొందగలుగుతుంది. ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవితాన్ని పొందే హక్కులో సెక్స్ ఎడ్యుకేషన్?, అందుకు సంబంధించిన సమాచారం పొందే హక్కు కూడా కలిసి ఉంటుంది" అని పేర్కొంది. రుతుక్రమం సమయంలో బాలికలకు పాఠశాల్లో సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యకు దూరమవుతున్నారని, దీని వల్ల భవిష్యత్?లో వారు అన్ని రంగాల్లో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు అన్నింటిలో ఏఎస్?టీఎం డీ-6954 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన ఆక్సో-బయోడిగ్రేడబుల్? శానిటరీ న్యాప్?కిన్లను విద్యార్థినులకు ఉచితంగా అందించేలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించింది.